
# వర్షం!

'ఓ.జి.కె'



వర్షం!

హోరున కురుస్తోంది వర్షం!

"ఎదవ వర్షం!" నోట ఒకటవ సారిగా తిట్టుకున్నాడు అప్పలనాయుడు బురదలో కూరుకు పోయిన కాళ్ళు బయటకులాక్కుంటూ.

ఆరుగంటల డ్యూటీ ఎక్కడానికి బయలేరాడు. హనుమాన్ సుగర్ మిల్సు ఎలక్ట్రిషియన్ అప్పలనాయుడు.

అతనికి ఆకలిగా ఉంది. మనసంతా చికాకుగా ఉంది. బుర్రంతా ఆలోచనలతో చిందర వందరగా ఉంది. ఒళ్ళంతా తడిసిపోయి నీరోడుతోంది అలవాటు పడిన అతని కాళ్ళుమటుకు ఫ్యాక్టరీ వైపు దారి తీస్తున్నాయి.

అతను పుట్టి పెరిగింది ఆ ఊర్లోనే.

ఆ మాటకొ స్తే అతని తాత ముత్తాతలు కూడా అక్కడ పుట్టి బట్టకట్టిన వాళ్ళే. వాళ్ళు అందుకు గుర్తుగా అతనికి మిగిల్చి వెళ్ళిన మిద్దిల్లే అప్పలనాయుడి కా రోజు మనశ్శాంతి లేకుండా చేసింది.

ప్రొద్దుట్నుంచీ కురుస్తున్న వర్షపు ధాటికి ఆగలేక తలొంచేసింది ఆ ఇల్లు మధ్యాహ్నమయేసరికల్లా. తల దాచుకుందుకు చోటైనా లేకుండా పోయిందని చిందులు వేయడం ప్రారంభించింది అప్పలనాయుడి పెళ్ళాం నూకాలమ్మ.

పరిస్థితులు ఆలోచించకుండా ఎదురు పడ్డ కష్టాలకు ఎదుటివాడి చేతకానితనమే కారణమని నిందించడం చాలా మందికి సరదా. అటువంటి స్వభావమే నూకాలమ్మదీను. పైపెచ్చు నోటి దురుసుతనం!

వినగలిగినంతసేపు విని, భరించగలిగినంతసేపు భరించి, శృతిమించి రాగాన పడగా ఆమె వీపు మీద గభీ గభీ మని నాలుగు గుద్దులు పడేసి రోడ్డెక్కాడు అప్పలనాయుడు, "తిండి తినిపోరారే" అన్న నూకాలమ్మ కేకను గాలికే వదిలేసి.

"పాపిస్టిదాన్ని. ఆడు తిండైనా తినకుండా సేసినాను" అని ఏడుపు లంకించుకు కూర్చుంది భారత నారినూకాలమ్మ.

రోడ్డెక్కిన అప్పలనాయుడి మనసంతా చికాకుగా ఉంది.

"అన్నీ తెలిసుండి కూడా అలా అరుస్తాదేం ఆ మనిసి! ఇల్లు బాగు సేయించాలని తనకు మాత్రం నేదూ? మేస్త్రీని పిలిపించి నెక్కకట్టించి అప్పుడే అర్నెల్లవుతోంది. అయిదొందలవుతాదన్నాడు మేస్త్రి. ఎక్కడ్నించి తేవాలిప్పుడా డబ్బు?" ఇదీ అతని ఆలోచనల ధోరణి.

పదిహేనవ ఏట హెల్పరుగా ఆ ఫ్యాక్టరీలో అడుగిడిన అప్పల నాయుడు నలభయ్యవ ఏటికి ఎలక్ట్రిషియన్ అనిపించుకున్నాడు. ఈ లోపుగా మనసు మంచితనం, నోటి దురుసుతనం ఉన్న నూకాలమ్మకు మొగుడూ, ఇల్లు తీసి పందిరేసే నలుగురు పిల్లలకు తండ్రీ అయాడు. సర్వీసుతో పాటు అతని జీతం పెరగక పోలేదు. కాని, పెరిగిన కుటుంబానికీ, పెరిగే ధరలకూ అది సమాన ఉజ్జీకాలేక పోయింది. ఏ పూట కాపూట గడవడమే కష్టమయి తండ్రి మిగిల్చి వెళ్ళిన ఆ ఇంటికి మరమ్మత్తు కూడా చేయించుకోలేని స్థితికి దిగజారి పోయాడతను.

ఆలోచన తేలకుండానే ఫ్యాక్టరీ చేరుకున్నాడు అప్పల నాయుడు.

## 2

హనుమాన్ సుగర్ మిల్సు మేనేజింగ్ డెరెక్టర్ శ్రీ హరినారాయణ ఝున్ఝున్‌వాలా గారికి నిమిషాలు గడుస్తున్న కొద్ది బ్లడ్ ప్రషర్ ఎక్కువయిపోతోంది.

"ఈ వెధవ వర్షం ఇవాళే తగ

లడాలా !" – అది కనీసం ఏ అరు వందల పన్నెండవ సారో అయి ఉంటుంది ఆయనలా తిట్టుకోవడం.

ఆ రోజు ఆయనకు చాలా ముఖ్యమైన రోజు ! అమెరికా వెళ్లి వచ్చిన తన స్నేహితురాలి గౌరవార్థం తమ ఇంటిలో పార్టీ ఏర్పాటు చేసింది వాళ్ళావిడ.

ఆమె ఆ ప్రక్క టౌన్ లేడీస్‌క్లబ్ సెక్రటరీ. పెద్ద పెద్ద పార్టీలు అడపా తడపా పారేసి ఆ పదవికి తిరిగి తిరిగి ఎన్నికవడం ఆమెకు హాబీ. ఆ పార్టీలు కోసం ఎదురు చూడడం ఆ క్లబ్ సభ్యురాండ్ర, వాళ్ళ భర్తల ముఖ్యసరదా. ఆమె అకారం, అహంభావం. నోటి దురుసుతనం సేఠ్‌జీకి సింహస్వప్నాలు.

ఆ రోజు అందువలనే ఆయన చాలా విపత్కర పరిస్థితిలో పడిపోయాడు.

ప్రొద్దుట్నుంచీ కురుస్తున్న వర్షపు ధాటికి ఎక్కడో చిన్న బీట ఇచ్చి ఉన్న ఒక ఇన్సులేటర్ దగ్గర 'ఫ్లా షోవర్' వచ్చేసి ట్రిప్ అయిపోయింది, కోలనీ కెళ్ళే ఎలక్ట్రిక్ లైన్. కోలనీ అంతా కరంట్ బంద్. ఫాల్ట్ ఎక్కడో తెలుస్తూనే ఉంది గాని, ఆ వర్షంలో స్తంభం ఎక్కి ఆ ఇన్సు లేటర్ మార్చే మొనగాడెవడూ కనపడడంలేదు. అదే స్తంబాల మీద ఆ ఎల్.టి. లైన్‌కి సరిగ్గా అడుగున్నర ఎత్తునఉంది,ఫ్యాక్టరీకివెళ్ళే హెచ్. టి. లైను. అది కూడా ఆపుచేయించనిదే ఈ వర్షంలో పోలెక్కడం ప్రమాదం, మే మెక్కమంటారు ఎలక్ట్రిషియన్లు అది ఆపితేఫ్యాక్టరీఅంతాఆగిపోతాది.ప్రాసెస్ ఫ్యాక్టరీ అయిదు నిమిషాలాగినా తిరిగి అయిదు గంటలు పడతాది తిరిగి 'సెట్' చేసుకురావడానికి, ఈ లోపుగా ఎంత నష్టం ? ససేమిరా అది ఆపడానికి వీలు లేదు. అది ఆపకుండానే ఎల్. టి. లైను రిపేర్ చెయ్యాలంటాడు సేఠ్‌జీ.

ఎవరినీ సమాధాన పరచలేక సతమయి పోతున్నాడు ఎలక్ట్రికల్ ఇంజనీరు రావ్. అతనా ఫ్యాక్టరీలో కొత్తగా చేరాడు.

పాతికేళ్ళ బ్రహ్మచారి రావ్ అదృష్టవశాత్తు వచ్చిన అవకాశాలను చేజార్చుకోక మూడునాలుగు ఉద్యోగాలు మాని, కష్టపడి పనినేర్చుకొని, మూడేళ్ళసర్వీసుతోనే అంతపెద్దఫ్యాక్టరీకి ఇంజనీర్ కాగలిగాడు. అతనికి ఆశలూ' ఆశయాలూ కూడా అనంతమే. ఎవడినైనా దబాయించి లైనెక్కించి పని జరిపించేస్తే సేఠ్‌జీ సంతోషిస్తాడు. డబుల్ ఇంక్రిమెంటో, ట్రిబుల్ ఇంక్రిమెంటో కొట్టేయొచ్చు అని ఆశపడుతోంది అతని మనసు. 'ఛ ! వెనకా ముందూ చూడకుండా మూర్ఖంగాప్రవర్తిస్తే ఒకవేళ ఏక్సిడెంట్ జరిగి ఆ పనివాడు చనిపోవడమే జరిగితే? తన స్వార్థంకోసం అటువంటి 'రిస్క్' తీసుకోకూడదు' అంటూ వెనక్కు లాగుతోంది అతనిలోని మాన

వత్వం.

సమయం మించిపోతోంది. చీకటి పులుముకుంటున్నది. లైను బాగుచేయ డానికి ఎవరూ ముందుకు రావడంలేదు. ఈ పరిస్థితుల్లో తాను చేయగలిగిం దేమీ లేదన్నట్లు ఒకమూల కూలబడ్డాడు రావ్. ఏమిటి చెయ్యాలో అర్థమవడం లేదు సేఠ్‌జీకి.

ఇంతలో ఆరుగంటలవడం, సైరన్ కూయడం, డ్యూటీలోని వారు బ్రతుకు జీవుడా అనుకుంటూ ఇంటి ముఖం పట్టడం, కొత్తగా డ్యూటీ ఎక్కేవాళ్ళు చిర్రుబుర్రులాడుతూ పనుల్లో సర్దుకోవడం— అంతా హడావుడి.

# 3

కొత్తషిఫ్టులో వచ్చిన ఎలక్ట్రిషియన్ ఎవడా అని ఆతృతగా చూశాడు సేఠ్‌జీ, అప్పలనాయుడిని చూడగానే అతని ముఖం వికసించింది. పరవాలేదు. వీడు మంచివాడే చిన్నప్పట్నుంచీ మన దగ్గర పని చేస్తున్నవాడే. మనమాట కొట్టివేయ లేడులే అని సమాధానపడ్డాడు. రావ్‌ని పిలిచి చెప్పాడు. అప్పలనాయుడిని కదిపి చూడమని.

అయితే అసలే 'మూడ్స్' బాగులేని అప్పలనాయుడు మర్యాద దక్కించలేదు. ఇంజనీర్ మాటలు వింటూనే అతనిమీద విరుచుకుపడ్డాడు. "చెప్పడానికి ఆయనకు బుద్ధిలేకపోతే అడగడానికి మీకెలా నోరొచ్చిందండీ?" అంటూ.

తెల్లపోయాడు రావ్. అయితే అంత లోనే సర్దుకొని అధికారదర్పంతో దబా యించబోయాడు — "ఎవరికోసం చేస్తా వోయ్?" అంటూ.

దూరం నుంచి ఈ ఘర్షణ అంతా చూస్తున్న సేఠ్‌జీకి మరింత కంగా రెక్కువయింది. ఇటువంటి సమయాల్లో దబాయింపు లాభంలేదని ఆ అనుభవజ్ఞు డికి బాగా తెలుసు. ఎక్కడ ఎలాంటి చిట్కా వాడాలో అతనికి కరతలామ లకం, అందుకే స్వయంగా రంగంలో దూకాడు తన ఆఖరు అస్త్రం ప్రయోగిం చడానికి.

దగ్గరగా వచ్చిన సేఠ్‌జీని చూస్తూనే కొంచెం తగ్గాడు అప్పలనాయుడు. మరింత విజృంభించాడు రావ్.

అతన్ని వారిస్తూ, అప్పలనాయుడి బుజం తట్టుతూ — "ఏమయ్యా! చాలా కోపంమీద ఉన్నట్టున్నావే? చూడు. అవ సరం వచ్చినపుడు కొంచెం కష్టమయినా, నష్టమయినా పనికి వెనకాడ కూడదు. అయినా నీ కష్టం నేను ఉంచుకోనులే. పని సవ్యంగా పూర్తిచేసేసావంటే నీకు అయిదువందల రూపాయిలు బహూమాన మిస్తాను. ఏమంటావ్?" అంటూ తన ఆఖరి అస్త్రం ప్రయోగించాడు సేఠ్‌జీ.

అస్త్రం గురితప్పలేదు. ఘాటుగా సమాధానం చెపుదామని తెరిచిన అప్పల నాయుడి నోరు తెరిచినట్టుగానే ఉండిపో యింది. అతని కళ్ళముందు రూపాయలు నాట్యంచేసాయి. బుర్రలో ఆలోచనలు చెలరేగాయి.

"అయిదొందలు! ఆటితో తన ఇల్లు రిపేరుఅయిపోతాది. పెళ్ళాం నోరుమూతడి పోతాది. ప్రమాదమయితే అయిందిలే మన గీత బాగుంటే అన్నీ బావుంటాయి" మరి ఆలోచించదలుచుకోలేదు. అప్పల నాయుడు ఒక్కసారి ఇంజనీరువంకా.

సేఠ్ జీ వంకా చూసి— "సర్లెండి ప్రయత్నిస్తాను" అన్నాడు మెల్లిగా.

విజయగర్వంతో మీసాలు మెలేశాడు సేఠ్ జీ "అద్గదీ! అలాగుండాలి పనోడంటే" అని ఉబ్బేసాడు రావ్.

కావలసిన సామాన్లు సమకూర్చుకొని పనిమీద కెళ్ళాడు అప్పలనాయుడు. తోటి పనివాళ్ళు కొందరు వారిస్తున్నా వినకుండా.

ఏళ్ళ తరబడి చేస్తున్న పని. అల వాటు పడిన కాళ్ళూ చేతులూ వాటిపని అవి చేసుకు పోతున్నాయి. ఆ వర్షంలోనే స్తంభం ఎక్కడం, పాడయిన ఇన్సులేటరు తీసేసి కొత్తది బిగించడం అన్నీ పది నిమిషాలలో జరిగిపోయాయి. వైరుని కొత్త ఇన్సులేటరుమీద కూర్చోబెట్టి బైండింగ్' చేసేస్తూ తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు అప్పలనాయుడు. ఓస్! అయిపోయింది. ఇంకొక్క రెండు నిమిషాలు పని. 'లైన్' 'ఆన్' చేసేడం, అయిదొందలూ పుచ్చుకోవడం, అలసిపోయానని సెలవడిగి ఇంటికి చెక్కేయడం. ఎల్లూనే ఆ అయిదొందలూ నూకాలమ్మ మొఖాన కొట్టాల. అప్పుడు సూడాలి నా రాజా! దాని మొఖంలో రంగులు. అప్పలనాయుడి తడాకా ఏమిటో తెలిసిరావాలి, దెబ్బతో దానికి.

దగ్గరలో ఎక్కడో మెరుపు మెరిసింది కళ్ళు మిరమిట్లు గొల్పుతూ, ఉరుము ఉరిమింది భయంకరంగా. ఆలోచనలలో మైమరచిన అప్పల నాయుడు ఉలిక్కి పడ్డాడు. బైండింగ్ వైరు ఆఖరి చుట్టు చుడుతున్న అతని చేతులు, స్తంభాన్ని వాటేసుకొనివున్న అతని కాళ్ళూ ఒక్కసారి పట్టుతప్పాయి.

గొల్లుమన్నారు షెడ్డులో నిలబడి చూస్తున్న మిగిలిన పనివాళ్ళు, ఇంజనీరూనూ. గబ గబా పరిగెత్తారు వర్షంలోకి.

బురద నేలలో దొర్లుతోంది అప్పలనాయుడి శరీరం. బాధతో మెలికలు తిరిగిపోతూకూడా, రావ్ ని చూస్తూనే, వికసించిన ముఖంతో— "సార్! పనై పోయింది. లైన్ని 'ఆన్' సేసేవొచ్చు." అన్నాడు ఆయాసపడుతూ.

అతన్ని లోపలకు తీసుకెళ్ళమని పురమాయించి, గబగబా సేఠ్ జీ దగ్గరకు పరిగెత్తాడు రావ్.

సేఠ్ జీ కూడా దూరం నుంచి అంతా చూస్తూనే ఉన్నాడు. అప్పలనాయుడు కింద పడగానే గుండె ఆగినంత పని అయింది అతనికి. జరగబోయే దర్యాప్తులూ, ఇవ్వవలసిన లంచాలు తల్చుకుంటూనే బెంగెట్టుకున్నాడాయన. ఇంతలో ఇంజనీర్ వచ్చి అప్పలనాయుడికి ప్రాణభయం లేదనీ, బహుశా కాలు ఫ్రాక్చరయి ఉండవచ్చనీ, లైన్ రిపేరు కూడా అయిపోయిందని అతను చెబుతున్నాడనీ చెప్పినప్పుడు పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టయింది.

"అయితే ఇంకా ఆలోచిస్తావేమయ్యా? లైన్ 'ఆన్' చేసేసి, అప్పలనాయుడిని తీసుకొని 'జీప్'లో పట్నం వెళ్ళి హాస్పిటల్లో జాయిన్ చేసేసిరా"— అంటూ హడావుడిగా అతిథుల స్వాగత సత్కారాలకుగాను తరలిపోయాడు సేఠ్ జీ.

'ఆన్' చెయ్యబడిన లైన్ 'ట్రిప్'

అవలేదు, అప్పుడప్పుడే ఆవరణలోకి వస్తున్న ఫస్టుబేచ్ అతిథుల వాహనాలకు స్వాగతం పలికేయి ఒక్కసారిగా వెలిగిన కాలనీలోని లైట్లు, సేఠ్‌జీగారి పరువు దక్కింది. ఆయనగారి సతీమణి ముఖం విప్పారింది.

వీటన్నింటికి కారణమయిన అప్పల నాయుడిని హాస్పిటల్లో 'ఎడ్మిట్' చేసి, ఇద్దరు పనివాళ్ళను తోడుంచి అర్ధరాత్రికి ఇంటికి చేరాడు రావ్.

## 4

మర్నాడు సాయంత్రం మళ్ళా పట్నం వెళ్ళాడు రావ్. అతను వెళ్ళేసరికి మంచి హుషారుగా ఉన్నాడు అప్పలనాయుడు. ఎప్పుడు వచ్చిందో యేమో, మంచం పక్కనే కూర్చొని ఉంది నూకాలమ్మ ఏడుస్తూ. ఆమెను ఓదారుస్తూ వేదాంతం చెపుతున్నాడు అప్పలనాయుడు. తోడుగా ఉంచిన పనివాళ్ళిద్దరూ చాలా శ్రద్ధగా వింటున్నారు ఆ వేదాంతాన్ని

రావ్‌ని చూసి అందరూ లేచి నిల బడ్డారు. అప్పలనాయుడు కూడా లేచి కూర్చోబోయేడు గాని, వారించాడు రావ్. ప్రక్కనే ఉన్న స్టూలు మీద కూర్చొని కుశలప్రశ్న లడిగాడు.

తనకేమీ పరవాలేదనీ,బాధకూడా బాగా తగ్గిపోయిందనీ. ప్రొద్దుటే పెద్ద డాక్టరు గారు వచ్చి చూసి, ఫోటోలు తీయించి, ప్లాస్టర్ చేయించేశారనీ, ఒక్క వారం రోజులు హాస్పిటల్‌లో ఉంచి 'డిస్చార్జి' చేసేస్తా మన్నారనీ, తరువాత మరొక రెండు వారాలపాటు ఇంటిదగ్గర మంచం దిగకుండా 'రెస్టు' తీసుకొని వస్తే కట్టిప్పేస్తామన్నారనీ విపులంగా చెప్పి- "రేపు మా ఆడది పాక్టరీ కొస్తాది బాబూ, కొంచెం సేఠ్ గారితో సెప్పి ఆ అయి దొందలూ దానికిప్పించి శారంటే నేనొచ్చి తలికి ఇంటి రిపేరీ అ యి పో తా ది. బా బ్బా బూ ! ఈ కొంచెం సాయం చేయ్యాల మీరు"- అంటూ రావ్‌ని ప్రతి మాలాడు అప్పలనాయుడు.

గతుక్కు మన్నాడురావ్. అంతలోనే సంభాళించుకొని నవ్వుతూ- "ఆవిడ కంత శ్రమ అక్కర్లేదు లేవోయ్! సేఠ్‌గారు ఆ అయిదు వందలూ నాకు ప్రొద్దుటే ఇచ్చారు నీకు అం ద జే య మ ని. ఇ దు గో తీ సు కో." అం టూ జే బు లో ను ం చి అ యి దు వం ద రూపాయిలనోట్లు తీసి అప్పలనాయుడికి అందించి, సెలవు తీసుకు బయటకు నడి చాడు, వాళ్ళ సంబరం చూసి సంతో షిస్తూ.

అక్కడ్నుంచి తిన్నగా హోటల్లో దూరి కాఫీ తాగుతూ ఆలోచనలో పడ్డాడు రావ్. అతనికి పదేపదే జ్ఞాపకం వస్తోంది ఆ డబ్బు తీసుకునేటప్పుడు అప్పల నాయుడి ముఖంలో, అ త ని భార్య ముఖంలో కన్పడ్డ వెలుగు, సంతోషం, కృతజ్ఞత

"పరవాలేదు. తను చేసిన త్యాగం వృథాకాలేదు. భాషకందని ఆ భావాల్ని కళ్ళారా చూడగలగడమే తనకు ప్రతి ఫలం. పూర్ సేఠ్ జీ! అతనికి జన్మలో ఆ అవకాశం కలుగుతుందా?"

అప్రయత్నంగా అతనికి జ్ఞా ప క ం వచ్చింది ఆరోజు ప్రొద్దుట తనకూ, సేఠ్ జీకి జరిగిన సంభాషణ.

ప్రొద్దుటే సేఠ్‌జీని బంగళాలో కలిశాడు రావ్. అప్పలనాయుడిని హాస్పిటల్‌లో 'ఎడ్మిట్' చెయ్యడం, ప్రాణభయమేమీలేదని డాక్టరు చెప్పడం — అన్నీ వివరించి, తాను తిరిగి ఆ రోజు సాయంత్రం అతన్ని చూడడానికి వెళ్దామనుకుంటున్నాననీ, సేఠ్‌జీ ఇస్తానన్న బహుమతి డబ్బు ఇస్తే తాను అప్పలనాయుడికి అందజేయగలననీ చెప్పాడు.


ఆ మాటలు వింటూనే అంతెత్తున లేచాడు సేఠ్‌జీ "నీకేమైనా మతిపోయిందా రావ్? పని సవ్యంగా పూర్తి చేసుకొనివస్తే అయిదొందలు ఇస్తానన్నానుగాని కిందపడి కాళ్ళు విరగ్గొట్టుకొని హాస్పిటల్లో మంచం ఎక్కితేనటయ్యా ఇస్తానన్నది? వాడి కాలు విరగడంతోనేసరా? దాని కిప్పుడెన్ని ఎంక్వయిరీలూ? ఎంతగొడవా? ఎంత ఖర్చు? పైపెచ్చు ఈ హాస్పిటల్ ఖర్చులో వాడు తిరిగి బాగుపడేవరకూ వాడ్ని కూర్చోబెట్టి జీతం ఇవ్వడమో? ఇదంతా ఎంతయింది? ఇవన్నీ ఆలోచించకుండా వాడికి బహుమతి ఇవ్వమని రికమెండ్ చెయ్యమనడానికి కొచ్చావానువ్వు? చాలు చాల్లె ఇంక వెళ్ళు".

తెల్లబోయాడు రావ్. అతని మనస్సు విరిగిపోయింది. ఛీ ఎంత అల్పంగా ఆలోచిస్తున్నాడు సేఠ్‌జీ ఇటువంటివాడిని సంతోషపెట్టడానికా తానంత కష్టపడింది? అప్పలనాయుడు వంటివాళ్ళను ఇరుకునపెట్టి పనిచేయించింది? బాధతో మెలికలు తిరిగిపోతున్న అప్పలనాయుడి ముఖం అతని స్మృతిపథంలో మెదిలింది.

"ఇది చాలా అన్యాయం సార్!"— అప్రయత్నంగా అనేశాడు రావ్.

ఈసారి తెల్లబోవడం సేఠ్‌జీ వంతయింది. ఒక ఆఫీసర్ మేనేజిమెంటుకి ఎదురు తిరగడం అతను సహించలేనిది, ఊహించ లేనిది కూడా! ఉద్రేకంతో ఊగిపోతూ — "చూడు మిష్టర్! మాకు కావలసింది మేము చెప్పినట్టు విని పనిచేసే వాళ్ళే గాని మాకు పాఠాలు చెప్పేవాళ్ళు కాదు. మా పద్ధతి నీకు నచ్చనప్పుడు మా సంస్థలో నీకు స్థానం లేదు." — అంటూ లేచి లోపలికి పోయాడు.

ఆ విసురుపాటు రావ్‌కి భయం కలిగించలేదు. అతనంటే అసహ్యం కలిగించింది, తన సామర్థ్యం మీద, మానవత్వంమీద నమ్మకమున్న అతను తనకది సరయిన స్థానంకాదని ఆ క్షణంలోనే నిర్ధారణ చేసేసుకున్నాడు. తిన్నగా ఆఫీసుకు వెళ్ళి రాజీనామా ఇచ్చేసి, సాయంత్రానికల్లా ఎకౌంట్ సెటిల్ చేసేసుకొని టౌను చేరాడు.




అప్పలనాయుడికి సంభవించిన ప్రమాదానికి పరోక్షంగా తను కూడా కారకుడే గనుక ఆ పాపపరిహారార్థం, అతను ఆశ పెట్టుకున్న ఆ అయిదువందల రూపాయలూ తనే ఇచ్చి, అతని ఆశలు అడియాసలు కాకుండా చేశాడు రావ్. ఆ బహుమానాన్ని అందుకొనేటప్పుడు అప్పలనాయుడి కళ్ళల్లో మెరిసిన సంతోషం అతనికి మనశ్శాంతిని కలిగింపజేసింది.

ఇప్పుడు అతనికి మిగిలిన ఆలోచనల్లా ఒకటే—"అప్పలనాయుడు తిరిగి డ్యూటీలో జాయినయినప్పుడు ఎలాగూ సేఠ్‌జీకి కృతజ్ఞత లందజేయడానికి వెళ్తాడు. అప్పుడు సేఠ్‌జీ రియాక్షన్ ఎలా ఉంటుంది? సిగ్గుపడతాడా? బాధపడతాడా? లేక అయాచితంగా లభించిన కృతజ్ఞతలకి, అవి అందుకోవడానికి తాను అనర్హుడయినా, పొంగిపోతాడా?"